సాక్షి
ములుగు
ఆదివారం । 25 । ఆగస్టు । 2024



ఏకాభిప్రాయం కుదిరేనా..?

టీజీఎన్పీడీసీఎల్‌లో అన్‌యూజ్డ్ పోస్టుల విషయంలోయూనియన్లు, అసోసియేషన్ల ఏకాభిప్రాయంపై సందేహాలు నెలకొన్నాయి.

8లో▸



సీపీఐ బలోపేతానికి కృషి..

సీపీఐ బలోపేతానికి శ్రేణులు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు.

8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$31^0/26^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణంగా ఉంటుంది. రాత్రి చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సలహాలు, సూచనల స్వీకరణ



ములుగు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయదలచిన తెలంగాణ హక్కుల రికార్డు బిల్లు 2024 ముసాయిదా ఆర్‌ఓఆర్ చట్టంపై శనివారం కలెక్టర్ దివాకర సలహాలు, సూచనలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రాతో కలిసి జిల్లా స్థాయిలో రైతు సంఘాల నాయకులు, మేధావులు, విద్యావేత్తలు, న్యాయవాదులు, పాత్రికేయులు, పదవిలో ఉన్న రెవెన్యూ అధికారులు, పదవీ విరమణ పొందిన వారితో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారికి కలెక్టర్ నూతన తెలంగాణ హక్కుల రికార్డు బిల్లు 2024లో పొందుపరిచిన అంశాలను వివరించారు. చర్చా వేదికలో భాగంగా బిల్లు అంశాలపై తీసుకున్న అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, ఆయా రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

స్టార్ హాస్పిటల్ తనిఖీ



ములుగు: జిల్లా కేంద్రంలోని స్టార్ హాస్పిటల్‌ను శనివారం టీబీ నియంత్రణ, ఎయిడ్స్, లెప్రసీ విభాగం రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ ఎ.రాజేశం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషన్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విపిన్‌లతో కలిసి ఆస్పత్రిలోని రికార్డులతో పాటు క్లినికల్ ఎస్టాబ్లిష్‌ను పరిశీలించారు. సిటిజన్ చార్టర్, ధరల పట్టిక, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లు లేని కారణంగా ఆస్పత్రికి నోటీసులు జారీ చేయాలని డీఎంహెచ్‌ఓ అప్పయ్యను ఆదేశించారు. తనిఖీలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దుర్గారావు, పూర్ణ, సంపత్‌రావు తదితరులు ఉన్నారు.

రాష్ట్ర అవార్డు గ్రహీత భాస్కర్‌కు సన్మానం



ఏటూరునాగారం: విధుల్లో ఉత్తమ సేవలందించినందుకు గాను పంద్రాగస్టున రాష్ట్ర ఉత్తమ అవార్డు అందుకున్న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీనియర్ అసిస్టెంట్ సీహెచ్.భాస్కర్‌కు శనివారం సన్మానించారు. తొలుత పుష్ప గుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సీహెచ్.వెంకటయ్య, ఫాతిమా, జ్యోతి, మున్ని, రమేష్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కాళేశ్వరాలయంలో భక్తుల రద్దీ



కాళేశ్వరం: శ్రావణమాసం సందర్భంగా మహదేవపూర్ మండలం కాళేశ్వరాలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ముందుగా గోదావరిలో పుణ్యస్నానాలు చేసి గోదావరిమాతకు పూజలు చేశారు. అనంతరం గర్భగుడిలో అభిషేక పూజలు చేశారు. శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన పూజలు చేశారు. నవగ్రహాల వద్ద శనిపూజలు, శ్రీసుబ్రహ్మణ్యస్వామి వద్ద కాలసర్ప నివారణ పూజలను భక్తులు సామూహింగా నిర్వహించారు. సాయంత్రం లక్షబిల్వార్చన పూజలు నిర్వహించారు. అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆలయంతో పాటు పరిసరాలు, గోదావరి తీరం వద్ద భక్తుల సందడి కనిపించింది.



వివాహ వేళ.. సరిగమల సవ్వడి

శుభకార్యాల్లో మళ్లీ ట్రెండింగ్‌లోకి ‘ఆర్కెస్ట్రా’

సాక్షి, వరంగల్

ఓవైపు వేణుగానం.. ఇంకోవైపు తబలా వాయిద్యం. మరోవైపు డ్రమ్స్ మోత. వీటన్నింటికీ సరిపడా సప్తస్వరాలు. శుభకార్యమేదైనా ఇప్పుడంతా లైవ్ మ్యూజిక్‌దే ట్రెండ్. ఒకప్పుడు ఆర్కెస్ట్రా ఫేమస్. కాలక్రమంలో డీజే దాని స్థానాన్ని భర్తీ చేసింది. ఇప్పుడు శుభకార్యాల్లో బంధువులను అలరించేందుకు మళ్లీ లైవ్ మ్యూజిక్‌కే పట్టం కడుతున్నారు ఓరుగల్లు వాసులు. డీజేను తలదన్నేలా.. హోరెత్తించే పాటలు.. నవ్వులు కురిపించే మిమిక్రీ షో, చూపు తిప్పనివ్వకుండా చేసే సంప్రదాయ నృత్యాలు, వీనుల విందైన కోలాటం, ఇలా.. అన్ని వర్గాలు, వయసుల వారి అభిరుచులకు అనుగుణంగా అలరిస్తున్నాయి ఆర్కెస్ట్రా ట్రూప్‌లు. ఈవారం అదే.. ‘సాక్షి’ సండే స్పెషల్.

- మారుతున్న ఓరుగల్లువాసుల అభిరుచులు
- ఇన్నాళ్లు డీజేలు.. ఇప్పుడు లైవ్ మ్యూజిక్‌కు జేజేలు
- అతిథులను అలరిస్తున్న కోలాటం, సంప్రదాయ నృత్యాలు

సండే స్పెషల్

ఓరుగల్లువాసుల అభిరుచులు మారుతున్నాయి. ఇన్నాళ్లు పెళ్లిళ్లు, కాలేజీ ఫంక్షన్లలో రికార్డింగ్ మ్యూజిక్ అయిన డీజేకు, ట్రాక్స్‌తో పాడే కరవోకే సంగీతానికి ప్రాధాన్యమిచ్చేవారు. ఇప్పుడు లైవ్ మ్యూజిక్ ‘ఆర్కెస్ట్రా’ వైపు మనస్సు మళ్లించుకుంటున్నారు. కరోనా మహమ్మారి వ్యాప్తి తర్వాత జనం నుంచి దాదాపు దూరమైన ఈ ఆర్కెస్ట్రా మ్యూజిక్ ఇప్పుడు మళ్లీ ట్రెండ్‌లోకి వచ్చింది. ఓరుగల్లులో దాదాపు ఏ ఫంక్షన్‌లో చూసినా.. ఆర్కెస్ట్రా అలరిస్తోంది.

పెరిగిన డిమాండ్..

వరంగల్ నగరంలో జరిగే శుభకార్యాల్లో ఆర్కెస్ట్రా ట్రూప్‌లకు డిమాండ్ పెరుగుతోంది. ఇన్నాళ్లు ఇదే కళను నమ్ముకున్న వారికి పెద్దగా ప్రోగ్రాంలు లేకపోయినా.. ఇప్పుడిప్పుడే ఈ ట్రెండ్ మళ్లీ మొదలవడంతో కళాకారులకు చేతినిండా పనిదొరుకుతోంది. కార్యక్రమాన్ని బట్టి ఆర్కెస్ట్రా నిర్వాహకులు చార్జ్ చేస్తున్నారు. జాజ్ డ్రమ్స్, ఎలక్ట్రానిక్ కీ బోర్డులు, తబలాలు తదితర ఆధునిక సంగీత పరికరాలతో పెళ్లి మండపంలో పండుగ వాతావరణాన్ని క్రియేట్ చేస్తున్నారు.



ఉర్సుగుట్టలోని ఓ వివాహ వేడుకలో ఆర్కెస్ట్రా బృందం సందడి

వీనుల విందు

శుభకార్యాలకు వచ్చే బంధువులు మైమరిచిపోయేలా వీనుల విందైన జానపద, సినీ, భక్తి గీతాలు ఆలపిస్తూ అన్ని తరాల వారిని ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు ఆర్కెస్ట్రా బృంద సభ్యులు. పెళ్లికి వచ్చిన వారిని అలరించేలా ఈ లైవ్ మ్యూజిక్ కట్టిపడేస్తోంది. పెద్ద పెద్ద సినీ గాయకులే కళ్ల ముందుకొచ్చి పాడుతున్నారా? అనేలా ఈ పాటలుంటున్నాయి.



పాటే కాదు.. ఆట కూడా

శుభకార్యానికి వచ్చిన బంధుగణానికి కేవలం పాటలే కాదు ఆకట్టుకునే ఆటలు కూడా అందిస్తున్నారు ఆర్కెస్ట్రా బృంద సభ్యులు. పాటలకు తగినట్లుగా డ్యాన్స్ చేస్తూ.. కోలాటమాడుతూ.. మిమిక్రీ షోలతో అలరిస్తున్నారు. మరికొందరు ధనవంతులైతే.. శుభకార్యాల్లో ఆర్కెస్ట్రాతో పాటు ‘సంగీత్’ ప్రోగ్రాంలు పెట్టి కుటుంబ సభ్యులతో స్టెప్పులేయిస్తున్నారు. వారితోనూ పాటలు పాడిస్తున్నారు.

అభిరుచులకు అనుగుణంగా..



శుభకార్యాలకు వచ్చే జనం అభిరుచులకు తగినట్లుగా పాటలు పాడుతున్నాం. అక్కడున్న పరిస్థితులకు తగినట్లుగా పాటలు పాడుతూ అలరిస్తున్నాం. మధ్యమధ్యలో వారి బంధువుల్లా కలిసిపోతూ నవ్వించే ప్రయత్నం చేస్తున్నాం. ఓవరాల్‌గా మాకు మళ్లీ మంచి రోజులు వచ్చాయి. **- చంద్రశేఖర్, గాయకుడు**

అందరినీ అలరిస్తున్నాం..



మా నాన్నను చూసి తొమ్మిదో ఏటనుంచే తబలా వాయించడం నేర్చుకున్నా. ఆ తర్వాత చాలా తెలంగాణ పాటలకు రికార్డింగ్స్ చేశా. వందల కార్యక్రమాల్లో తబలా వాయించా. కరోనా తర్వాత ఆర్కెస్ట్రాకు డిమాండ్ తగ్గింది. మళ్లీ ఇప్పుడిప్పుడే శుభకార్యాల్లో ఆర్కెస్ట్రా లైవ్ మ్యూజిక్ కావాలంటూ సంప్రదిస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే వారి బంధువులను సంగీతంతో అలరిస్తున్నాం. **- వజీద్, తబలా వాయిద్యకారుడు**

కూతురి పెళ్లికి ఆర్కెస్ట్రా పెట్టించా..



నాకు సంగీతం అంటే ఇష్టం. ఇటీవల నా కూతురు పెళ్లి చేశాను. వియ్యంకుడి కుటుంబ సభ్యులు కూడా సంగీతప్రియులే. అతిథులకు డీజేలాంటి శబ్దంతో విసుగువస్తుంది. అందుకే ఆర్కెస్ట్రా పెట్టించాం. వేదికపై లైవ్‌లో కళాకారులు శ్రావ్యమైన పాటలు పాడుతుంటే వచ్చిన అతిథులు ఎంజాయ్ చేశారు. పాత, కొత్త పాటల కలయిక, కోలాట బృందంతో అంతా సందడిగా మారింది. **- పానుగోటి పరిపూర్ణాచారి, వరంగల్**

కేసుల పరిష్కారానికి సహకరించాలి

- సివిల్ కోర్టు సీనియర్ జడ్జి కన్నయ్యలాల్

ములుగు: సెప్టెంబర్ 28వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేలా సహకరించాలని సివిల్ కోర్టు సీనియర్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కన్నయ్యలాల్ పోలీసు అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని కోర్టు సమావేశ మందిరంలో జిల్లాలో ఆయా సర్కిల్ పోలీసులతో ముందస్తు సమీక్ష సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. కేసుల రాజీ పట్ల కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. రాజీమార్గమే రాజమార్గమనే విషయాన్ని వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సౌఖ్య, సీఐలు రవీందర్, శ్రీనివాస్, బండారి కుమార్, ఎస్సైలు సతీశ్, కమలాకర్, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, తాజోద్దీన్, సూరి, డీసీఆర్‌బీ ఎస్సై షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి కన్నయ్యలాల్

గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ టీఎస్.దివాకర

గోవిందరావుపేట: ఈ నెల 27న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జిల్లాకు రానున్న నేపథ్యంలో పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ టీఎస్.దివాకర అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గవర్నర్ జిల్లా పర్యటనలో భాగంగా లక్నవరం సరస్సు ఐలాండ్‌ను సందర్శించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను కలెక్టర్ శనివారం పరిశీలించి మాట్లాడారు. ఐలాండ్‌లో గదులను శుభ్రం చేయడంతో పాటు శానిటేషన్ చేయాలన్నారు. ఐలాండ్‌ను సుందరంగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గవర్నర్ పర్యటన ఏర్పాట్లకు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం లక్నవరం సరస్సులో అధికారులతో కలిసి బోటింగ్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, సీహెచ్. మహేందర్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ అజయ్ కుమార్, డీఈ ఎలక్ట్రిసిటీ నాగేశ్వరరావు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



లక్నవరం ఐలాండ్‌లోని గదులను పరిశీలిస్తున్న కలెక్టర్



సరస్సులో అధికారులతో కలిసి బోటింగ్ చేస్తున్న కలెక్టర్

కలెక్టర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ పాలకవర్గం

ములుగు: రాష్ట్ర గవర్నర్, రెడ్‌క్రాస్ రాష్ట్ర అధ్యక్షుడు జిష్ణుదేవ్ వర్మ ములుగుకు రానున్న క్రమంలో జిల్లా రెడ్ క్రాస్ పాలకవర్గం సభ్యులు శనివారం కలెక్టర్, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు టీఎస్.దివాకరను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూలమొక్క అందించి శాలువాతో సన్మానించారు. రెడ్‌క్రాస్ కార్యక్రమాలను కలెక్టర్‌కు వివరించారు. ఈ మేరకు స్పందించిన కలెక్టర్ రెడ్‌క్రాస్ సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీహెచ్. మహేందర్‌జీ, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ అల్లెం అప్పయ్య, రాష్ట్ర పాలకమండలి సభ్యులు కొత్తపల్లి ప్రసాద్‌రావు, జిల్లా సలహాదారు శ్రీనివాసరావు, జిల్లా వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీనివాస్, కార్యదర్శి చుంచు రమేశ్, సభ్యులు కొట్టె రాజిరెడ్డి, బండి ఈశ్వర్, గూడూరు మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే ప్రభుత్వ ధ్యేయం

వెంకటాపురం(ఎం): రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని బ్లాక్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మాధురి స్కూల్ ఆవరణలో శనివారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసం వ్యవసాయానికి ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ పథకాలను అమలు చేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందన్నారు. అందులో భాగంగానే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా రుణమాఫీ పొందిన బీఆర్ఎస్ నేతలే రోడ్లపైకి వచ్చి రుణమాఫీ కాలేదని ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిల్కూరి అయిలయ్య, బండి శ్రీనివాస్, బుర్ర సమ్మయ్య, జంగిలి రవి, చెన్నోజు శ్రీనివాస్, కాంతాల రాజిరెడ్డి, ఎస్‌కె.జాకీర్, పిట్ట విజయ్‌బాబు, శ్రీనివాస్, వెంకటేశ్, తిరుపతి, సాంబయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భగవాన్‌రెడ్డి

ట్రైకార్ నిధులేవి



- 2020–22లో గిరిజనుల ఉపాధికి 6,761 యూనిట్లు
- ఈఎస్ఎస్ కింద రూ.55కోట్లు మంజూరు
- 90యూనిట్లకు రూ.81.43 లక్షల తోనే గ్రౌండింగ్ చేసిన అధికారులు



ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని గిరిజనులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కో ఆపరేటీవ్(ట్రైకార్) నిధులతో చిన్న తరహా పరిశ్రమలను నెలకొల్పేందుకు ప్రణాళిక రూపొందించింది. ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2020–21, 2021–22సంవత్సరంలో 6,761యూనిట్లకు ఎకనామికల్ సపోర్ట్ స్కీం కింద అప్పటి ప్రభుత్వం రూ.55కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను ఐటీడీఏ అధికారులు పరిశీలించారు. అయితే ఇప్పటి వరకు 3,911యూనిట్లకు సబ్సిడీ రూపంలో రూ.34.09 కోట్లు మంజూరు ఇచ్చి 956 యూనిట్లకు ట్రైకార్ ద్వారా బ్యాంకులకు రూ.8.56 కోట్లు మాత్రమే సబ్సిడీ విడుదల చేశారు. అందులో గిరిజనులకు ఇచ్చింది మాత్రం కేవలం 90యూనిట్లకు గాను రూ.81.43 లక్షలతోనే గ్రౌండింగ్ చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. మిగతా యూనిట్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 6,761 యూనిట్లకు కేవలం 90యూనిట్లు మాత్రమే అందజేయడంతో గిరిజనులపై అధికారులకు ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతోంది. అసలు ట్రైకార్ నిధులు ఉన్నాయా లేవా అని గిరిజనులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఊసేలేని ఈఎస్ఎస్

ప్రతీ ఆర్థిక సంవత్సరంలో గిరిజనులకు స్వయం ఉపాధి కింద ఈఎస్ఎస్(ఎకానమికల్ సపోర్ట్ స్కీం) ద్వారా సుమారుగా 175రకాల యూనిట్ల రూపొందించి దానిలో అర్హులైన గిరిజనులకు కొంతమేర యూనిట్లను గ్రౌండింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ 2020 నుంచి ఇప్పటి వరకు యూనిట్లు క్షేత్రస్థాయిలో గ్రౌండింగ్ కాకపోవడంతో 2022–23లో ఎలాంటి దరఖాస్తులను స్వీకరించలేదు. అలాగే 2023–24లో సైతం బడ్జెట్ కూడా కేటాయించకపోవడంతో గిరిజనుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ చేపట్టకపోవడం విడ్డూరంగా మారింది. గతంలో మంజూరైన యూనిట్లే ఇప్పటి వరకు ఇవ్వలేదని, ఇప్పుడు యూనిట్ల కోసం దరఖాస్తులు ఎలా తీసుకోవాలని ఈఎస్ఎస్ పథకంపై ఊసే ఎత్తకపోవడం గమనార్హం. ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు మారిన ట్రైకార్ పారదర్శకంగా గిరిజనులకు యూనిట్లను మంజూరు చేయలేకపోతుందనే విమర్శలు వస్తున్నాయి. ఇవే కాకుండా గతంలో మంజూరు చేసిన న్యూట్రీషన్ ఫుడ్ చిన్న తరహా పరిశ్రమ సైతం మూలకుపడింది. రూ.40లక్షల యూనిట్ నిరుపయోగంగా మారిపోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి అర్హులైన రుణాలు గ్రౌండింగ్ చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

పహాణీలతో తీసుకున్న రుణాలు మాఫీ చేయాలి

ములుగు: గతంలో పహాణీ నకల్ ఆధారంగా రుణాలు తీసుకున్న రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకంతో సంబంధం లేకుండా రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భూక్య జంపన్న నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరణీ వచ్చిన తర్వాత పహాణీలు ఇవ్వలేదని తెలిపారు. ఇప్పుడేమో రుణమాఫీ కావాలంటే పాస్‌పుస్తకం తప్పనిసరి అని బ్యాంకర్లు కొర్రీలు పెడుతున్నారని తెలిపారు. అలాంటి రైతులు జిల్లాలో వేలాది మంది ఉన్నారని వివరించారు. తోటి రైతులకు రుణమాఫీ జరిగి పహాణీతో తీసుకున్న రుణాలు మాఫీ కాని రైతులు మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని కోరారు. అదే విధంగా రీ షెడ్యూల్ రుణాలను కూడా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు గుండారపు రాజు, రాజేందర్, శ్రీను, నాగార్జున, మహేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జంపన్ననాయక్


సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

భూపాలపల్లి: జిల్లాలో జన సంచార ప్రదేశాల్లో తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని బస్టాండ్, మెడికల్ కాలేజీతో పాటు పలు ప్రాంతాల్లో ఎస్పీ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి సీసీ కెమెరాల పనితీరును తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. నేరాల అదుపుతో పాటు, నేరస్తులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ ద్వారా 24 గంటలు సీసీ కెమెరాల పర్యవేక్షణ కొనసాగుతుందని చెప్పారు. ప్రజలు తమ ఇల్లు, ఆఫీసు, ముఖ్య కార్యాలయాల వద్ద కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.


ప్రవేశాల గడువు పొడిగింపు

భూపాలపల్లి అర్బన్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ప్రవేశాల గడువును ఈ నెల 31 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రమణారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో బీఏ, బీకాం, బీఎస్సీ, ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ నెల 31వ లోపు ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు. వివరాలకు 63014 96140 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

చిన్నారుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి



గోపికల వేషధారణలో నృత్యం చేస్తున్న బాలికలు



విద్యార్థికి ఛత్రపతి శివాజీ చిత్రపటాన్ని అందిస్తున్న నిర్వాహకులు, ఆర్టీఓ సిరాజ్

- ఆర్టీఓ సిరాజ్ అహ్మద్

ములుగు: చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు కృషి చేయాలని జిల్లా రోడ్డు రవాణా అధికారి(ఆర్టీఓ) సిరాజ్ అహ్మద్ అన్నారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఉత్సవ సమితి అధ్యక్షుడు గంధ్రకోట కుమార్ ఆధ్వర్యంలో బాలగోకులం కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో వచ్చి ఆటపాటలు, నృత్యాలతో అలరించారు. ప్రతిభ చూపిన వారికి ఛత్రపతి శివాజీ చిత్రపటాలను జ్ఞాపికగా అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలతో చిన్నారుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని తెలిపారు. కులమతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవడం భారతదేశ వాసులకే సాధ్యం అన్నారు. నృత్యాలతో అలరించిన చిన్నారులకు ఆయన అభినందనలు తెలిపారు. రాష్ట్రీయ సేవికా సమితి ప్రతినిధి వాంకుడోతు జ్యోతి మాట్లాడుతూ చిన్నారులు చిన్నప్పటి నుంచే మంచి నడవడికను అలవర్చుకోవాలన్నారు. స్థానికుడు నూనె భిక్షపతి చిన్నారులకు పులిహోర ప్యాకెట్లు అందజేశారు. సన్‌రైజర్స్ స్కూల్ కరస్పాండెంట్ పెట్టెం రాజు, సౌండ్ బాక్సు సిస్టం అందించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శోభారాణి, ఆయా పాఠశాలల కరెస్పాండెంట్లు ఎండీ జావీద్, కర్ర రాజేందర్‌రెడ్డి, కోటిరెడ్డి, రజినీకాంత్, కవిత, సురేందర్‌రెడ్డి, అక్కల సతీశ్, శ్రీనివాసరావు, ఉత్సవ సమితి సభ్యులు రవిరెడ్డి, శ్రీనివాస్, మహేశ్, సాయిరాం, సాత్విక్, అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థుల ప్రవర్తనను పర్యవేక్షించాలి

● సీపీ అంబర్ కిషోర్ ఝా



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం : విద్యార్థుల ప్రవర్తనను కళాశాలల యాజమాన్యం, అధ్యాపకులు పర్యవేక్షించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. శనివారం కమిషనరేట్ పరిధిలోని డిగ్రీ, ఇంటర్ కళాశాలల యాజమాన్యం, ప్రిన్సిపాళ్లతో సీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్ మత్తు పదార్థాలకు చిక్కకుండా, విద్యా సంస్థలలో గంజాయిని కట్టడి చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కళాశాలలో విద్యార్థుల భాగస్వామ్యంతో యాంటి డ్రగ్స్ విభాగం ఏర్పాటు చేసి విద్యార్థుల అలవాట్లపై శ్రద్ధపెట్టాలన్నారు. విద్యార్థుల వ్యక్తిగత వ్యవహారశైలిలో మార్పులు వస్తే తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో పాటు వారికి కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. హాస్టళ్లు, క్యాంటీన్, టీ షాపులలో తనిఖీలు నిర్వహించాలని, కళాశాలలో ఎవరైనా గంజాయి విక్రయించినా, వినియోగించినా కమిషనరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డ్రగ్స్ కంట్రోల్ విభాగానికి సమాచారం అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రవీందర్, ఏసీపీలు జితేందర్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

'ఏబాన్' మిషన్లు వచ్చేశాయ్..

● అనుమానితులకు గంజాయి టెస్టింగ్

● త్వరలో డ్రైవ్ నిర్వహించే అవకాశం



కాజీపేట అర్బన్ : బ్రీత్ ఎనలైజర్.. మందు బాబులను పసిగట్టే మిషన్. 'ఏబాన్'.. గంజాయి బాబులను పసిగట్టే మిషన్. మత్తు పదార్థాలకు అడ్డుకట్ట వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం 'ఏబాన్' మిషన్లు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో కాజీపేట ఎక్సైజ్ స్టేషన్‌లో శనివారం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వేముల చంద్రమోహన్ వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు టీఎన్యాబ్ డైరెక్టర్ సందీప్‌శాండిల్య, రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి ఆధ్వర్యంలో 'ఏబాన్' మిషన్ల ఎక్సైజ్, పోలీస్‌స్టేషన్లలో అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. గంజాయి సేవించిన వారి యూరిన్(మూత్రం)ను 'ఏబాన్' మిషన్ ద్వారా టెస్ట్ చేస్తే గంజాయి మోతాదు తెలుపుతుందన్నారు. గంజాయి సేవించినప్పటి నుంచి ఆరు నెలలోపు ఈ మిషన్ పసిగడుతుందన్నారు. 'ఏబాన్' మిషన్‌తో గంజాయితో పాటు 12 రకాల డ్రగ్స్‌ను కనిపెట్టే అవకాశం ఉందని తెలిపారు. మందుబాబులకు నిర్వహిస్తున్న డ్రంకెన్ డ్రైవ్ మాదిరి త్వరలో అనుమానితులకు గంజాయి డ్రైవ్ నిర్వహించే అవకాశం ఉందని తెలిపారు.

ఏకాభిప్రాయం కుదిరేనా?

అన్‌యూజ్డ్ పోస్టులు వినియోగంలోకి వచ్చేనా?

● వృథాగా 216 వర్క్‌మెన్ పోస్టులు

● ఇతర పోస్టులుగా మార్చాలని ఉద్యోగుల డిమాండ్

● అభిప్రాయ సేకరణ సమావేశానికి కొన్ని సంఘాలకే పిలుపు.. మరికొన్నింటికి నో ఇన్విటేషన్

● పెల్లుబికుతున్న నిరసన



హన్మకొండ : టీజీ ఎన్పీడీసీఎల్‌లో అన్‌యూజ్డ్ పోస్టులను వినియోగంలోకి తీసుకురావడంలో యూనియన్లు, అసోసియేషన్ల మధ్య ఏకాభిప్రాయం కుదిరేనా అనే సందేహాలు విద్యుత్ ఉద్యోగ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. సంస్థ పరిధిలో 216 వర్క్‌మెన్ పోస్టులు ఏళ్ల తరబడి వృథాగా ఉంటున్నాయి. అయితే క్షేత్ర స్థాయిలో సిబ్బంది తక్కువ ఉండడంతో ఆ పోస్టులను క్షేత్ర స్థాయిలో వర్క్‌మెన్ పోస్టులుగా మార్చాలని డిమాండ్ ఉంది. ఏపీఎస్ఈబీ ఉన్న సమయంలో మంజూరైన పోస్టులు మినహా ఆ తర్వాత క్షేత్ర స్థాయి పోస్టులు పెంచలేదు. రిటైర్‌మెంట్‌తో ఖాళీ అయిన పోస్టులను నోటిఫికేషన్ జారీ చేసి భర్తీ చేస్తున్నారు. ఏపీఎస్ఈబీ నాటికి, ఇప్పటికి వేలల్లో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, వందల్లో విద్యుత్ సబ్ స్టేషన్లు, లక్షల్లో సర్వీస్‌లు పెరిగాయి. కానీ ఈ మేరకు ప్రభుత్వం, విద్యుత్ సంస్థ యాజమాన్యాలు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగంలో పోస్టులు పెంచలేదు. జిల్లాల పునర్విభజనతో ఎన్పీడీసీఎల్‌లో సర్కిళ్లు, డివిజన్లు, సబ్ డివిజన్లు పెరిగాయి. ఈ మేరకు పై స్థాయిలో ఇంజనీరింగ్, అకౌంట్స్ విభాగంలో ప్రభుత్వం అదనంగా పోస్టులు మంజూరు చేసి నియామకాలు చేపట్టింది. కానీ వినియోగదారులకు క్షేత్ర స్థాయిలో నేరుగా సేవలందించే ఆపరేషన్, మెయింటెనెన్స్ పోస్టులు మాత్రం పెంచలేదు. దీంతో క్షేత్ర స్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజ్ పోతే రైతులు, వినియోగదారులు మారుస్తూ విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

క్షేత్రస్థాయి ఉద్యోగుల మండిపాటు..

ఈ నెల 13, 14, 16న కమిటీ ప్రతిపాదన రూపొందించింది. దీని ప్రకారం 216 అన్‌యూజ్డ్ పోస్టులను 241 పోస్టులుగా క్రియేట్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇందులో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులు 11, సీనియర్ అసిస్టెంట్ 80, ఆఫీస్ సబార్డినేట్ 70, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ 32, ఎమ్మార్టీలో అసిస్టెంట్ లైన్‌మెన్ 48 పోస్టులుగా మారుస్తూ ప్రతిపాదనలు రూపొందించింది. పోస్టుల విలువ రూ.74,64,750. మిగిలిన రూ.20 లక్షలతో ఇంజనీర్, పర్సనల్ అండ్ జనరల్, అకౌంట్స్ విభాగంలో పోస్టులు పెంచాలనే నిర్ణయానికి వచ్చారు. అయితే ఎమ్మార్టీలో ఇప్పటి వరకు అసిస్టెంట్ లైన్‌మెన్ పోస్టులు లేవు. ఇక్కడ సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, ఫోర్‌మెన్ పోస్టులు కావాలని ఎమ్మార్టీ ఉద్యోగులు డిమాండ్ చేస్తుండగా లేని అసిస్టెంట్ లైన్‌మెన్ పోస్టులు కావాలని ప్రతిపాదనలు పంపడం పట్ల ఎమ్మార్టీ జేఏసీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. క్షేత్ర స్థాయిలో ఉద్యోగులతో చర్చించి, వినియోగదారుల అవసరాలు దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా ఆఫీస్‌లో కూర్చుని తమ ఇష్టానుసారంగా పోస్టులు క్రియేట్ చేస్తున్నారని క్షేత్రస్థాయి ఉద్యోగులు మండిపడుతున్నారు.

కార్మిక న్యాయ స్థానాన్ని ఆశ్రయించిన ఓ యూనియన్?

ప్రధాన యూనియన్లకు చెందిన ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు ప్రొవెన్షియల్ ఉద్యోగులు కావడంతో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగంలో అవసరాలను వారు గుర్తించలేకపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విమర్శలు, అభ్యంతరాల నేపథ్యంలో అన్‌యూజ్డ్ వర్క్‌మెన్ పోస్టులపై ఏకాభిప్రాయం కుదరడం సాధ్యమయ్యేన అని ఉద్యోగ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఇదిలా ఉండగా ఓ యూనియన్ కార్మిక న్యాయ స్థానాన్ని ఆశ్రయించినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ కార్యదర్శికి దృష్టికి లేఖ ద్వారా తీసుకెళ్లినట్లు తెలిసింది.

ఇతర పోస్టుల క్రియేట్‌కు కమిటీ నియామకం..

ఎన్పీడీసీఎల్‌లో నిరుపయోగంగా ఉన్న 216 వర్క్‌మెన్ పోస్టుల విలువ 2010 పే స్కేల్ ప్రకారం రూ.24,15,400 ఉంది. 2018 పే స్కేల్స్ ప్రకారం వీటి విలువ రూ.93 లక్షలుగా ఉంది. ఈ విలువ మేరకు ఇతర పోస్టులు క్రియేట్ చేసేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం 2024, ఆగస్టు 7న ఐదుగురు చీఫ్ ఇంజనీర్లు సభ్యులుగా, ఒక జనరల్ మేనేజర్ కన్వీనర్‌గా కమిటీ నియమించింది. రిజిస్టర్డ్ ట్రేడ్ యూనియన్లు, అసోసియేషన్ల అభిప్రాయాలు సేకరించి అన్‌యూజ్డ్ పోస్టులను ఇప్పటి అవసరాలకు అనుగుణంగా అవసరమైన పోస్టులుగా మార్పు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించింది. అయితే ఈ కమిటీ కొన్ని ట్రేడ్ యూనియన్లు, అసోసియేషన్లను మాత్రమే పిలిచి, మరికొన్ని ట్రేడ్ యూనియన్లను పక్కన పెట్టింది. దీంతో ఆ సంఘాల నుంచి నిరసన పెల్లుబికుతుంది.

కేయూ దూరవిద్య ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, పరీక్షల విభాగం అధికారులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ దూర విద్య డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సుల మొదటి, ద్వితీయ, ఫైనల్ ఇయర్ పరీక్షల ఫలితాలను రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఎస్. నర్సింహాచారి శనివారం విడుదల చేశారు. బీఏ మొదటి సంవత్సరంలో 50.31శాతం, రెండో సంవత్సరం 55.52శాతం, తృతీయ సంవత్సరంలో 59.31శాతం ఉత్తీర్ణత సాధించారు. బీకాం మొదటి సంవత్సరంలో 36.45శాతం, ద్వితీయ సంవత్సరంలో 23.82 శాతం, తృతీయ సంవత్సరంలో 26.25 శాతం ఉత్తీర్ణత సాధించారు. బీఎస్సీలో మొదటి సంవత్సరంలో 17.65శాతం, ద్వితీయ సంవత్సరంలో 15.28శాతం, తృతీయ సంవత్సరంలో 8.57 శాతం ఉత్తీర్ణత సాధించారని పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారి తెలిపారు. బీబీఏ రెండో సంవత్సరంలో 20 శాతం, బీబీఏ తృతీయ సంవత్సరంలో 42.11శాతం మంది ఉత్తీర్ణత సాధించారని వివరించారు. కార్యక్రమంలో కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారులు నరేందర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ హక్కుల సాధనకు పోరాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న సుందర్‌రాజ్ యాదవ్

నయీంనగర్ : బీసీ హక్కుల కోసం, కుల గణనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సుందర్‌రాజ్ యాదవ్, ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ మాట్లాడారు. బీసీ మండల్ జయంతి సందర్భంగా నేడు (ఆదివారం) కాజీపేట పారడైజ్ ఫంక్షన్ హాల్‌లో బీసీల సమర శంఖారావం–బీసీల మేధోమదనం సదస్సుకు బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బీసీ మండల్ జయంతి కార్యక్రమానికి మండల్ మనవడు సూరజ్ యాదవ్, వివిధ పార్టీల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు హాజరవుతారన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు, కామారెడ్డి డిక్లరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేసే విధంగా పోరాడుతామన్నారు. బీసీల రాజ్యాధికారం కోసం పోరాడుదామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు.సమావేశంలో విజయబాబు, జనార్దన్, కృష్ణ బెనర్జీ, పులి రజినీకాంత్, టి.క్రాంతికుమార్, వేణుమాధవ్ గౌడ్, రాకేశ్ యాదవ్, వీరస్వామి, గోలి సుధాకర్, వెంకన్న, శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పరువు పోయిందని.. యువకుడి ఆత్మహత్య

● కట్య్మార్‌లో ఘటన

బచ్చన్నపేట : ఆటోను ఫైనాన్స్ నిర్వాహకులు తీసుకెళ్లడంతో అందరిలో పరువుపోయిందని ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం రాత్రి మండలంలోని కట్కూర్‌లో జరిగింది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బొడ్డు కర్ణాకర్(28) నాలుగు నెలల క్రితం ఫైనాన్స్‌లో ఆటో తీసుకుని నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఇటీవల ఆటో సరిగా నడవకపోవడంతో కిస్తీలు సకాలంలో చెల్లించలేదు. ఈ విషయంలో ఈ నెల 23వ తేదీన ఫైనాన్స్ నిర్వాహకులు ఆటోను తీసుకెళ్లారు. దీంతో గ్రామంలో అందరి ముందు పరువు పోయిందని మనస్తాపంతో కర్ణాకర్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై కంకల సతీశ్‌కుమార్ ఘటనా స్థలికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. మృతుడి కుటుంబీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కర్ణాకర్‌కు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కాగా, అందరితో కలివిడిగా ఉండే కర్ణాకర్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్..

● రెండిళ్లలో చోరీ

● 15 తులాల బంగారం, కిలో వెండి, రూ.1.5 లక్షల నగదు అపహరణ

హసన్‌పర్తి : కేయూ పీఎస్ పరిధిలోని 65వ డివిజన్ నిరూప్‌నగర్‌తండా, 56వ డివిజన్ పరిధిలోని గాయత్రీనగర్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోరీలు జరిగాయి. దుండగులు తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. 65వ డివిజన్ నిరూప్‌నగర్‌కు చెందిన భూక్య భీమా నాయక్ స్థానికంగా మేస్త్రీ. బుధవారం తాటికొండలో జరిగిన తీజ్ పండుగకు కుటుంబీకులతో కలిసి వెళ్లాడు. శనివారం ఉదయం ఇంటికి రాగా తలుపులు ధ్వంసమై కనిపించాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న పది తులాల బంగారం, కిలో వెండితో పాటు 1.50లక్షల నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలికి చేరుకుని జాగిలాలతో గాలించారు. వేలి ముద్ర నిపుణులు ఆధారాలు సేకరించారు. అలాగే, 56వ డివిజన్ గాయత్రీ కాలనీకి చెందిన వెంకట్‌రెడ్డి కుటుంబసభ్యుతో కలిసి తాళం వేసి బయటకు వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి దొంగలు తలుపు ధ్వంసం చేసి బీరవాలోని ఐదు తులాల బంగారం అపహరించుకెళ్లారు. కాగా, రెండు రోజుల క్రితం ఇదే కాలనీలో చిరంజీవి ఇంటిలో చోరీ జరిగింది.

ముందే హెచ్చరించిన పోలీసులు.

పీఎస్ పరిధిలో ఉత్తరభారతదేశం నుంచి అంతరాష్ట్ర దొంగలు సంచరిస్తున్నట్లు పోలీసులు ముందే హెచ్చరించారు. రెండు రోజుల క్రితం పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ పత్రిక ప్రకటన కూడా విడుదల చేశారు. ఇంటికి తాళం వేసి వెళ్తే పీఎస్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. అయినా ప్రజలు పెడచెవిన పెట్టారు. ఫలితంగా చోరీలు జరిగిన రెండిళ్లు తాళాలు వేసినవే.

సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి

● పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

● ముగిసిన సీపీఐ రాష్ట్ర సమితి నిర్మాణ సమావేశాలు



సమావేశానికి హాజరైన సీపీఐ ప్రతినిధులు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

న్యూశాయంపేట : సీపీఐ బలోపేతానికి శ్రేణులు నిరంతరం కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి నిర్మాణ సమావేశాలు శనివారం హనుమకొండలో ముగిశాయి. ఈనెల 22 నుంచి మూడు రోజులు జరిగిన కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ సమావేశాలకు రాష్ట్ర సమితి సభ్యులు, ఆహ్వానితులు మొత్తం 124 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. కాగా, కూనంనేని ప్రవేశపెట్టిన కార్యదర్శి నివేదిక, పార్టీ నిర్మాణంపై విస్తృతంగా జరిగిన చర్చల్లో వివిధ జిల్లాలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు. భవిష్యత్ రాజకీయ కార్యాచరణ నిర్ణయించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు. ఈనెల 22న సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా.. పార్టీ పతాకం ఆవిష్కరించి సమావేశాలు ప్రారంభించారు. జాతీయ కార్యదర్శులు డాక్టర్ నారాయణ, అజీజ్‌పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, పశ్య పద్మ, జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులు పరిణామాలు, పార్టీ నిర్మాణం, విస్తరణ, బలోపేతం, తదితర అంశాలపై తమ సందేశాలు ఇచ్చారు. హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.శ్రీనివాస్‌రావు, కే.శంకర్, బోస్, బాలమల్లేశ్, బాలనరసింహ పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

● రూ.76,500 విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్

మహబూబాబాద్ రూరల్ : ఇద్దరు దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.76,500 విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ అన్నారు. ఈ మేరకు టౌన్ పీఎస్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. టౌన్ ఎస్సై బి.విజయ్ కుమార్ తన సిబ్బందితో కేసముద్రం రోడ్డులోని మహర్షి స్కూల్ వద్ద వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో వరంగల్ జిల్లా నెక్కొండ బీసీ కాలనీకి చెందిన సంపంగి శేఖర్, పంజాల రాజేశ్..ఈదులపూసపల్లి వైపు నుంచి స్కూటీపై వస్తున్నారు. ఆపి వివరాలు అడుగుతుండగా పారిపోయేందుకు యత్నించారు. దీంతో అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా స్కూటీలో వెండి, బంగారు ఆభరణాలు కనిపించగా ఎక్కడివని ప్రశ్నించారు. ఈ నెల 13వ తేదీ రాత్రి మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియం ఎదుట ఉన్న ఇంటి తాళం పగులగొట్టి వెండి, బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. వాటిలో నుంచి జల్సాలకు నగదు వినియోగించుకోగా మిగతా వెండి, బంగారు ఆభరణాలు ఎక్కడైనా షాపులో అమ్మేందుకు తీసుకొస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా చెన్నారావుపేట మండలం తిమ్మరాయినిపహాడ్‌లో కూడా చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో వెండి, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు.

ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయస్సు పెంచాలి



కోదండరామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధ్యులు

కేయూ క్యాంపస్ : యూనివర్సిటీల్లో విధులు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయస్సు 60 నుంచి 65 ఏళ్లకు పెంచాలని, నూతన అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించాలని కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం(అకుట్) అధ్యక్షుడు ప్రొఫెసర్ తాటం శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి, ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ బ్రహ్మేశ్వరి కోరారు. ఈమేరకు శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరామ్‌ను హైదరాబాద్‌లో వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వయస్సు 58నుంచి 61 సంవత్సరాలకు పెంచిందని, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లకు మాత్రం విరమణ వయస్సు పెంపుదల చేయలేదన్నారు. సీనియర్ ప్రొఫెసర్లు లేనప్పుడు రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు న్యాక్, ఎన్‌బీఏ అక్రిడిటేషన్‌లో తాము కోరుకున్న ర్యాంకింగ్‌లు పొందలేరన్నారు. వర్సిటీల్లో తగినంత అధ్యాపకుల సంఖ్య లేకుంటే ఐసీఎస్ఎస్ఆర్, సీఎస్ఐఆర్‌ల నుంచి పరిశోధన,అభివృద్ధి గ్రాంట్లు రావడం కష్టంగా మారనుందన్నారు. కాగా, ఉద్యోగ విరమణ వయస్సు పెంచేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తెలిపారని అకుట్ బాధ్యులు తెలిపారు. వర్సిటీల నియామకాలపై ఉద్యోగ విరమణ వయస్సు పెంపుదల విషయంపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తామని ఎమ్మెల్సీ కోదండరామ్ అన్నారని వారు చెప్పారు.

27న 'తెనుగు పత్రిక' శతాబ్ది వేడుకలు

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో ఈనెల 27న తొలి తెలుగు దినపత్రిక 'తెనుగు పత్రిక' శతాబ్ది వేడుకలు నిర్వహించనున్నట్లు ఒద్దిరాజు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఒద్దిరాజు సుభాశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజాం సర్కార్ నిరంకుశ పాలనపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఇనుగుర్తి గ్రామానికి చెందిన కవులు, రచయితలు ఒద్దిరాజు సీతారామచంద్రరావు, రాఘవరంగారావు కలిసి తొలి తెలుగు దినపత్రిక 'తెనుగు పత్రిక' ఏర్పాటు చేశారని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకలకు సీనియర్ జర్నలిస్టు దేవులపల్లి అమర్ పాల్గొననున్నట్లు ఒద్దిరాజు సుభాశ్ తెలిపారు.

పెళ్లి బాజాలు మోగాల్సిన ఇంట్లో చావు డప్పు..

● ఆత్మహత్యకు పాల్పడిన యువతి

● చెల్పూర్‌లో ఘటన



కోమల (ఫైల్)

గణపురం: నాలుగు రోజుల్లో పెళ్లి బాజాలు మోగాల్సిన ఇంట్లో చావు డప్పు మోగింది. బంధువులు, ఆత్మీయుల నవ్వులు విరబూయాల్సిన చోట కన్నీళ్లు నిండాయి. ఏ మైందో ఏమో తెలియదుగాని కుటుంబ సభ్యులంతా సంబురంగా పెళ్లి పనుల్లో ఉండగా.. పెళ్లి కూతురు మాత్రం ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాదకర ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బటికె సంపత్‌కు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు వివాహం చేశారు. చిన్న కూతురు కోమల (25) డిగ్రీ పూర్తి చేసి ఇంట్లో ఉంటుంది. మూడేళ్ల క్రితం కోమలకు పెళ్లి సంబంధం చూసి వరపూజ కూడా చేశారు. అయితే కోమల తనకు పెళ్లి ఇష్టం లేదని తెలపడంతో ఆ సంబంధాన్ని రద్దు చేసుకున్నారు. ఇటీవల పోచారం గ్రామానికి చెందిన యువకుడితో సంబంధం కుదుర్చుకున్నారు. ఈనెల 28న వివాహం ఉండగా తల్లిదండ్రులు పెండ్లి పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో కోమల ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో ఆత్మహత్య చేసుకున్న కూతురిని చూసిన తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ శనివారం తెలిపారు.

సమయస్ఫూర్తికి సలాం..

● విద్యుత్‌షాక్‌తో గాయపడిన విద్యార్థిని కాపాడిన సహ విద్యార్థి



బన్ని



గాయపడిన చరణ్

కేసముద్రం: ప్రాణాపాయ సమయంలో ఓ విద్యార్థి సమయస్ఫూర్తి ప్రదర్శించాడు. ఈ సమయంలో ఏ మాత్రం తప్పిదం, ఆలస్యం చేయలేదు. చిన్న వయసులోనే పెద్ద ఆలోచనతో విద్యుత్ షాక్‌కు గురైన సహ విద్యార్థిని కాపాడాడు. ఈ ఘటన శనివారం మండలంలోని కల్వల జెడ్పీ హైస్కూల్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పాఠశాలలోని గ్రౌండ్‌ను చదును చేసేందుకు టిప్పర్‌లో మొరం తీసుకొచ్చారు. అయితే అదే పాఠశాలలోని ఆరోగ్య ఉపకేంద్రం భవనానికి ఉన్న విద్యుత్ తీగ టిప్పర్‌కు అడ్డుగా ఉంది. దీంతో ఆడుకుంటున్న పిల్లలకు విద్యుత్ తీగను పైకి లాగమని చెప్పగా 9వ తరగతి విద్యార్థి భుక్యా చరణ్ ఆరోగ్య ఉపకేంద్రం భవనంపైకి ఎక్కి తీగ పైకి లాగే ప్రయత్నం చేస్తున్నాడు. అదేచోట తీగ ఫెయిల్ కావడంతో విద్యుత్‌షాక్‌కు గురై కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ ఘటనను గమనించిన సహ విద్యార్థి జాటోత్ బన్ని (8వ తరగతి) పరుగెత్తుకుంటూ వెళ్లి భవనంపైకి ఎక్కాడు. ఇంతలో కింది నుంచి కొందరు విద్యార్థులు పైకి విసిరిన కర్రతో తీగపై బన్ని కొట్టాడు. దీంతో స్పృహ కోల్పోయిన చరణ్ కిందపడ్డాడు. వెంటనే అదే ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్యం అందించారు. కాగా, సమయస్ఫూర్తితో చరణ్‌ప్రాణం కాపాడిన బన్నిని ఉపాధ్యాయులు,గ్రామస్తులు అభినందించారు.

రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ రుణమాఫీ డ్రామాలు

● టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు



మాట్లాడుతున్న మార్నేని రవీందర్ రావు

హన్మకొండ: రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ రుణమాఫీపై లేనిపోని అపోహలు సృష్టించి రైతులను ఆందోళనకు గురిచేస్తోందని, రాజకీయ డ్రామాలు ఆడుతుందని తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్ మార్నేని రవీందర్ రావు విమర్శించారు. శనివారం హనుమకొండలోని డీసీసీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొన్నటివరకు అధికారంలో ఉండి రైతు సమస్యలను పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు నేడు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. దేశ చరిత్రలోనే కాంగ్రెస్ ప్రభుత్వం సాహసోపేత నిర్ణయం తీసుకుని రైతులందరికీ ఏక కాలంలో రుణమాఫీ చేసిందన్నారు. ప్రజల ఆశీస్సులతో అధికారంలో వచ్చాక రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన మాటకు కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర కేబినెట్ సమావేశంలో రుణమాఫీ కోసం రూ.31 వేల కోట్లు ఆమోదింపజేసి జీఓ తీసుకువచ్చారన్నారు. జూలై 18న రూ.లక్ష వరకు, జూలై 30న రూ.లక్షన్నర వరకు, ఈ నెల 15న రూ.2 లక్షల వరకు రుణాలు మాఫీ చేసిందని గుర్తుచేశారు. కేవలం 27 రోజుల్లో దాదాపు 22 లక్షల మంది రైతులకు దాదాపు రూ.18 వేల కోట్లు ఖాతాలో జమచేసిందన్నారు. అర్హులందరికీ రుణమాఫీ జరుగుతుందని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు.